# గులాబీ అత్తరు

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

ఒక్క అడుగు వేస్తే దివాంజీ కనపడతాడు.

అటుగా వొక్కసారి తనకేసి చూస్తే చాలునని ఆత్రపడుతూనూ, అతని కటాక్షం ఆశించీ, అతని అనుగ్రహం యెదురుచూస్తూనూ, అతని ఆలంబనం నమ్ముకునీ, అతనిచేత "సరే" అనిపించుకోడానికి తగ్గ యెత్తు లాలోచించుకుంటూనూ, అయినా, అతని లోభగుణం మాత్రం లోపల్లోపల గర్హించుకుంటూనూ ఆ గదిలో పరివేష్టించి వుండిన ఆశ్రితులూ, పౌరప్రముఖులూ, రాజబంధువులూ, రాజపురుషులూ కొంద రక్కడికే కనపడుతున్నారు.

వారిలో కొందరు తనకేసిన్నీ చూశారు.

అలాంటి చోట నుంచుని, మొదట, వొక్కమాటు గదిలోకి తొంగిచూసి, తరవాత, నిటారుగా నుంచుని, నుంచున్న వెంటనే తాపీగా రెండు చేతులూ చాపి, గబ్బుమని బిరడా తీసి, సీసా గాలి వాటాన పెట్టాడు షుకురల్లీఖాను, తల వెనక్కి విరుచుకుంటూ.

బిరడా తీశాడు, అంతే, వెంటనే బిగించేశాడు.

కాని, ఆక్షణమాత్రానికే అతని చుట్టూ వుండిన జవానులు తుళ్లిపడి మత్తెక్కుతున్న ట్లయిపోయారు.

లోపల వుండిన పెద్ద మనుష్యులూ, ఉలిక్కిపడి మొగప్రాపిరి తీసుకుంటూ యిటు చూశారు.

దివానుకి పక్కగానూ, కొంచెం వెనకవాటుగానూ నుంచునివుండి, దివాను రాతలు ఓరగంట చూస్తున్న రాణేదారున్నూ చకితుడై "వచ్చాడా?" అన్న ట్టొకమాటు గుమ్మంకేసి చూసి, మళ్లీ మొగం వంచుకున్నాడు, సాలోచనగా.

అప్పటి కప్పుడే నల్లబడ్డ మొగం పైకెత్తి "ఏయ్ ఏమిటీ కంపు?" అంటూ గర్జించాడు దివాంజీ, దగ్గరుంటూనూ తీక్ష్ణంగా చూస్తూనూ.

దీంతో, పండువెన్నెల్లో కటికచీకటి రేఖ విరిసినట్టయింది.

కొంచెం ఘాటుగానే వుండినా, హృదయంగమమైన పట్టివేళ్ళ అత్తరు కమ్మదనం దివాంజీకి కంపుగా తట్టడం చూసి, లోపల వుండినవా రందరూ మొగమొగాలు చూసుకున్నారు, ఉబికిన నవ్వు కళ్లల్లో కుక్కుకుంటూ.

"అరే, అరే" అనుకుంటూ మొగం పక్కకు తిప్పుకుని, రాణేదారు, పెదవి కరుచుకున్నాడు,—తన రసికత గుర్తించమన్న ట్టొక రాజబంధువు కేసి బెల్లించి చూస్తూ.

జవానులున్నూ అందుకు వింతపడి అపవారించి పెదవులు కరుచుకున్నారు.

ఖాను కొయ్యే అయిపోయాడు.

కంపు అన్నమాట అపశ్రుతిగా కనపడిం దతనికి.

మంచి పరిమళంగల [illegible] వస్తువుల్లో, అత్తరు సౌరభం కంపుగా నెలపరించుకునే మనిషి కనపడడం అతనికిదే మొదటిసారి.

మొన్నమొన్ననే—రెండు మాసాలపాటు నానా అవస్థలూ పడిగాని గోలకొండ కోటలో అడుగు పెట్టలేకపోయా డతను.

అసలు, వజీరు దర్శనమే కాలేదు, నెలా పదిహేను దినాలు పడిగాపులు పడివుంటేనే గాని.

ఆ ప్రయత్నంలో, నిజంగా, తల ప్రాణం తోకకు వచ్చిందతనికి; కాని దర్శనం యిచ్చాక మాత్రం యీ వట్టివేళ్ల అత్తరుకే ఆ వజీరెంత ముగ్ధుడయి పోయాడనీ!

అప్పుడక్కడ వుండినవారున్నూ ఎంత సంబర పడ్డారు!

తరవాత, నవాబున్నూ ఎంత మెచ్చుకున్నాడు కాదూ?

మరి యిక్కడ, పెద్దాపురంలో, అడుగు పెట్టిన నాడే కావలసిన భోగట్టా అంతా దొరికిపోయింది.

మర్నాడే రాణేదారు ప్రసన్నుడయిపోయాడు.

మూడోనాడే కోటలో ప్రవేశం దొరికింది.

అయితే, అతని సౌభాగ్యానికీ చివరికిదా పరిణతి?

హిందువులలో విభ్రమవిలాసాలకు తగినంత విలువ లేకపోవడం అతనెరుగును.

పోనీ అంటే, నిర్లిప్తత కూడా అంతంతగానే వుండడమున్నూ అతనెరుగును.

అయితే మాత్రం, యింత తల్లకిందులా?

ఇంటికీ: —అత్తరు [illegible] బాధపడే మనిషి రాజు తరవాత రాజంతవాడయి వుండడమా?

దీనివల్ల, మహారాజా ప్రాభవం విషయమూ, కావలసిన సౌకర్యాల విషయమూ దివాంజీకి లక్ష్యం లేదనుకోవాలా, మహారాజు ప్రవృత్తి కూడా యిలాంటిదే అనుకోవాలా?

ఇది మిక్కిలీ అసంభావ్యంగా కనపడిందతనికి, "చివరికి ఏమి సంభవిస్తుందో" అని అనుమానమున్నూ పట్టుకుంది.

ఇంత మాత్రాన నిరాశ చేసుకోలేదు. గాని చేసుకోక తప్పదేమో అన్నట్టు జవాన్లకేసి అభావదృష్టులు పరిపాడతను.

ఈ స్థితిలో "ఏయ్, జవాన్" అని పిలిచాడు రాణేదారు, ద్వారంకేసి చూస్తూ.

"చిత్తం బాబయ్యా" అంటూ వెంటనే లోపలికి వెళ్లి "ఢిల్లీనుంచి అత్తరువర్తకుడు వచ్చి దర్శనం కోరుకుంటున్నాడండి" అని విన్నవించాడు.

దీనిమీద "అతనే. నేను మనవిచేసుకున్న సాయిబే నండి" అన్నాడు రాణేదారు, మెల్లిగా.

కాని దివాంజీ ముఖం పైకెత్తలేదు.

పైపెచ్చు "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా సాయిబు?" అని ముదలకించాడు, కొంచెం కటువుగా.

ఇది వినిన్నీ ఖాను తెల్లపోయాడు.

ఖానే కాదు, రాణేదారు కూడా యింకేమీ అందుకు ప్రత్యుత్తరం చెప్పలేకపోయాడు.

కాని "చిత్తగించారూ?" అంటూ వొక బోసినోటి శాస్త్రులు మాత్రం అందుకున్నాడు, తన ప్రతిభ చూపించడానికి యిలాంటి మంచి అవకాశం దొరికినందుకు, సోత్సాహంగా నలుగురికేసీ చూస్తూ.

తరవాత, దివాంజీ తల వంచుకునే వుండడంవల్ల అతణ్ణి మాత్రం వుద్దేశించి, ఒక్కొక్కమాటకొక్కొక్క పెద్దమనిషి కేసి చూస్తూ "దివాణంలోనే అంగడి తెరుస్తాడటనా?" అంటే చెప్పలేను గాని, ఆరేవు చేసింవాల్లో మాంచి భావుకత మాత్రం కనపడుతోంది. ఏమంటే? రాణేదారుగారి పరిచయ వాక్యాలవల్ల అతను ఫలానా అని మాత్రమే తెలుస్తుంది. అతని సామర్థ్యం నిగూఢంగానే వుండిపోతుంది. ఆవిషయం తనకి తానై చెప్పుకోడం యెంత

కే రవికతొమ్మిద కోదు, అంచేత, తన అత్తరు సువాసనతోనే తన విషయం యావత్తూ విశదపరుచుకున్నాడతను. ఇది చాలా గొప్పగా వుంది. ఢిల్లీలో మసులుకుంటున్న మనిషికి ఇదొక లెక్కా? అక్కడ యెంతెంతలేసి ఉమ్రావు లున్నారు! వారి దగ్గర మసులుకునే మనిషి సామాన్యుడయి వుంటాడా మరి? చాలా బాగుంది. తప్పకుండా చూడతగ్గవాడతను" అన్నాడతను, చివరి మాట రాణేదారుకి అందిస్తూ.

అయినా, దివాంజీ మాటాడలేదు.

చూడనూ లేదు.

రాస్తూ రాస్తూ వుండిన కలం మాత్రం కింద పెట్టి పాడుంకోయ అంను కున్నాడంతే.

౨

"ప్రవేశ పెట్టు" అన్నాడు రాణేదారు, 'సరే' అనే మాట దివాంజీ ప్రకటపరిచే పద్ధతి అది అని తెలుసు కనక.

ఈమాటమీద దివాంజీ కనుబొమ్మలు ముడి పడ్డాయి.

అతని బుర్రలో యేదో ఆలోచన ప్రవేశిస్తూ అది కళ్ళలో ప్రతిఫలించింది.

తన రసజ్ఞత అంతా వ్యర్థం అయిపోయినందుకు విస్తుపడుతున్న శాస్త్రులు అది చూసి ఉలిక్కి పడ్డాడు.

అప్పటికి కప్పతో వొక్క అంగలో లోపలికి వెళ్ళి "దివాంజీవారికి కోటి సలాములు. నేను ఢిల్లీనుంచి వచ్చానండి ఏలినవారి పాదాలు వెతుక్కుంటూ" అన్నాడు ఖాను, చేతు లూపుకుంటూనూ మూడు మార్లు వంగి లేస్తూనూ.

"ఏమి పని?" అనడిగాడు దివాంజీ, దర్పంగా, అతని సలాములు కళ్ళతో అందుకుని.

"నేను అత్తర్లు తయారుచేస్తాను మహాప్రభూ! దక్షిణదేశంలో, గోల్కొండ తరవాత పెద్దాపురం వొక్కటే చూడతగ్గది అని విన్నాను, రెక్కలు కట్టుకువచ్చి వాలాను, తమరు కటాక్షించాలి" అని వేడుకున్నాడు, ఖాను.

"రెక్కలుండడమే వస్తే యెక్కడో వొక్క చోట వెళ్ళి వాలక ముడుచుకుంటాడా మరి యెవడయినా?" అని ముదలకించాడు దివాంజీ.

ఇందులో వున్న దెబ్బ ఖాను గుర్తించకపోలేదు; కాని "తమరు సరిగా సెల విప్పించారు మహాప్రభూ! ఏమంటే? రెక్కలున్నందుకు ఫలితం యెక్కడ సరసు ఉంటే అక్కడ వాలడమే. కనకనే, నాలుగు తరాల నాడు, మా కుటుంబం, పారశీక దేశం విడిచి ఢిల్లీ వచ్చి వాలింది. వచ్చాక కూడా సైన్యంలో చేరడాని కొన్ని అవకాశాలు తటస్థపడినా, పేరు తెచ్చిన కళాజీవిక విడిచిపెట్టలేక అత్తరుతో తయారుచేసి ఢిల్లీ పాదుషాల ఆదరగౌరవాలు పొందుతోంది" అన్నాడు, ధోరణి మార్పించదలచి.

దీంతో "కావచ్చు" అన్నాడు దివాంజీ, కొంచెం వడి వల్లి. కాని చూపుల్లో మాత్రం సౌలభ్యం కనపడలేదు.

"ఏం? నాయన గారి సెలవుపొంది, నేను, దక్షిణదేశ ప్రభువులను సేవించుకోడానికి వచ్చాను. గోల్కొండ నవాబుగారూ, అక్కడి వజీర్లూ మా పరిశ్రమ గుర్తించి మిక్కిలి ఆదరించారు."

"ఇంకేం?"

“మనవిచేసుకున్నాను గదా, గోల్కొండ తరవాత పెద్దాపురమే చూడ తగ్గ దని విన్నా ననీ? ముందు తమ రిది చిత్తగించకోరుతున్నాను.”

ఇలా చెప్పి, ఖాను, మూత తెరిచి వొక చిన్న పెట్టి దివాంజీ సందుకొప్పెట్టెమీద వుంచాడు.

లోభాగాన, ఎర్రని ముఖముల్ గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది.

అందులో వొక చిన్న సీసా.

చక్కని నగిషీపనితో యెంతో ముచ్చటగా వుందది.

సీసాలో సగానికి పైగా వుంది అత్తరు.

అది చూసి అక్కడివా రందరూ గుటకలు మింగారు.

“అది మల్లె అత్తరు మహాప్రభూ! అందులో వున్నది రెండే తులాలు; కాని రెండు వసంతాలకు తయారయిం దది”

“వోస్ !”

“మా వస్తువు మర్యాద మాకు మేమయీ చెప్పుకోడం ధర్మం కాదు. చిత్తగిస్తే తమకు తెలియందీ కాదు. అయితే, మొగం కొంచెం యెడంగా వుంచి మరీ మూత తీయించండి మహాప్రభూ”

దీనిమీద, అక్కడివా రందరూ తమ ఘ్రాణేంద్రియానికి ఏకాగ్రత అలవరుచుకున్నారు; కాని “మాట్లాడా టప్పటికి ముందు మూత తియ్యడమే పనా మాకు?” అనడిగాడు దివాంజీ, దురుసుగా.

ఖాను మళ్లీ కుతకుత లాడిపోయాడు.

అయితే, అధికారదర్పం వొక్కొక్క మనిషిలో యెలాంటి పశుప్రవృత్తి రేకెత్తిస్తుందో అతనికి బాగా తెలుసు.

లక్షల కొద్దీ అధికారులతో నిండి వుండిన ఢిల్లీ నగరంలో, అతను, మొదట ఆర్జించింది యీ పరిజ్ఞానమే.

ఇలాంటి వాటికి నసాళం అంటేటట్టు బదులు చెప్పడమూ అతనికి చేత నవును.

మరొక పనిమీద వచ్చివుంటే అత నందుకు సందేహించకా పోవును.

ఇప్పు డలా చేస్తే కార్యభంగం తటస్థిస్తుంది.

పారితోషికం కంటే అతనికి, తన అత్తరుకు దేవ దుందుభులు మోగడం యెక్కువ అగత్యం.

అది మహారాజు ఎదటపడగలిగితేనే సిద్ధిస్తుంది.

అంచేత, అతను ఓపికపట్టాడు.

ఇంతే కాదు.

అలాంటి దురుసు మనిషిని, అందుకు తగ్గట్టు మాట్లాడి అంతకంటే యెక్కువ నొప్పించడం కంటే, తగ్గిమాట్లాడి, దారికి తెచ్చుకొని పడికట్టుపట్టులోకి తేడం కూడా వ్యవహర్తల లక్షణమే.

ఈ నిశ్చయంతో అతను “ఏలినవారు—”అంటూ ప్రారంభించాటప్పటికి, రాణేదారు కలగజేసుకుని “దివాంజీవారు, అది, సావకాశంగా తరవాత చిత్తగిస్తారు. ముందు నువ్వు వచ్చిన పనేమిట్లో మనవి చేసుకో” అని అందించాడు.

“చిత్తం,” చిత్తం, అంటూ వెంటనే మరో పెట్టె తెరిచి దివాంజీ యెదుట వుంచాడు ఖాను, రాణేదారు సమయస్ఫూర్తిని కళ్లతో మెచ్చుకుంటూ.

లోభాగాన, ఆకుపచ్చ ముఖముల్గుడ్డ అతికించిన చక్కని పెట్టె అది.

ఎర్రని అత్తరుతో, అపురూప మైన నగిషీపని చేసిన చిన్నసీసా వొకటి, కోటి కిరణాల కాంతి రత్నంలాగ మెరిసిపోతోంది, అందులో.

# గులాబీ అత్తరు

అక్కడివా రందరూ దాని స్వరూపానికే ముగ్ధులయి పోయారు; కాని దివాంజీ దానికేసి చూడనైనా లేదు.

అందుకున్నా నరాలు తోడేసినట్టయిపోయాడతను; కాని, యేమీ యెరగనట్టు "ప్రభువులకు తెలియంది లేదు" అంటూ ప్రారంభించాడు.

"పెద్దాపురం ప్రభువులకు నజరు పెట్టుకుందామని తయారుచేశానది. గోల్కొండ నవాబుగారికి వట్టివేళ్ల అత్తరు మిక్కిలి ప్రియం అని తెలిసి అది యెంత శ్రద్ధగా తయారుచేశానో, పెద్దాపురం మహారాజులుంగారికి గులాబీ అత్తరు మిక్కిలి ప్రీతిపాత్రం అని తెలిసి యిదీ అంత శ్రద్ధగానూ తయారుచేశాను. ఆసీసాలో వున్నది వొక్కటే తులం. దాని నిమిత్తం కాశ్మీరం జాతి పువ్వులు వాడాను. ఢిల్లీ పరిసరాలలో పారశీకజాతులే యెక్కువ. కాశ్మీరజాతి చాలా అరుదుగా దొరుకుతుంది. అంచేత, ఆకొస్త అత్తరూ తయారుకావడానికి ఖరాగా రెండేళ్లు పట్టింది మహాప్రభూ" అంటూ వివరాలు కూడా చెప్పాడతను.

ఇది విని అక్కడివారు దాని విశిష్టతా విలువా గ్రహించుకుని చాలా ఆనందించారు; కాని "అస్వ[illegible]?" అన[illegible] దివాంజీ, ముందు [illegible].

"గొప్ప వస్తువులు తయారుచేయాలంటే గడియల్లో సాగుతుందా మరి?" అంటూ ఖాను పరిశ్రమను మెచ్చుకున్నాను తరువాత.

"అయితే యెంతకి కిట్టింది పాపం?" అనడిగేశాడు చివరికి, జాలిపడుతున్నట్టు [illegible] చూస్తూ.

ఖాను నిర్విణ్ణుడయిపోయాడు.

అది గుర్తించి కళ్లంతా గర్వం చేసుకుని తల పంకించాడు దివాంజీ.

ఆ నిర్విణ్ణతా, యీ గర్వరేఖా చూసి అక్కడి పెద్ద మనుష్యులు చకితులైనారు.

అనేకరాజసభలూ, ఎన్నో నవాబుదర్బారులూ చూసి, సమస్తమర్యాదలూ అనుభవించిన షుకుర్‌ల్లీ ఖాను—అనేకశోధనలకు తట్టుకోగలిగిన ఆకళాశీలి యీ కొత్త దెబ్బకు వూగిపోయిన్నీ, మహారాజా మిక్కిలీ సరసుడని విని వున్నాడు కనక, రాజదర్శనంతో యీ మనోవైకల్యం అంతా పోతుం దని ఆశించుకుని, అత్తరు సౌరభం కంపుగా భావించిన అధికారి దగ్గర యింతకంటె రసికత వుంటుం దనుకోడం తనదే తప్పని తనకి తానే మందలించుకుని, అప్పటికి చేసేది లేక, యీ నిర్విణ్ణతా, దీంతో పుట్టిన కోపమూ, ఆవెంటనే వచ్చిన ఏవగింపూ అణుచుకుని, వినయమున్నా తెచ్చుకుని "అది నజరువస్తువు మహాప్రభూ! దక్షిణదేశానికంతకీ జాతిరత్నం శ్రీవత్సవాయి ప్రభువు నిమిత్తం ఉద్దిష్టమైనదిన్నీ, ఈ కారణాల్లవల్ల దాని కిట్టింపుధర అడగడం మాకు మన్నన కాదండి" అన్నాడు, కళ్ళలో బాధ కనపడుస్తూనే.

దీనిమీద "మరి మా ప్రభువులను నీ వెంతగా గౌరవిస్తున్నారో మాకు తెలియడం యెలాగా?" [illegible] దివాంజీ, [illegible].

"పెద్దాపురం రాజసభలో ఇలాంటి వస్తువుల [illegible] మహాప్రభూ?"

"మా ప్రభువుకోసం ఉద్దిష్టమైన వస్తువు వారి సెలవు పొందకుండా విప్పిచూడడం మాకు ధర్మమే అనుకోనా, నేను మరి?"

"మరి ప్రభువుల సన్నిధికి—"

"అది పరేనయ్యా! మేము వారి భృత్యులము కదా? మేమూ కొన్ని విధులు నిర్వర్తించుకోవాలి కదా?"

"నేను మనవిచేసుకునేది అదే మహాప్రభూ!"

"ఒకరితో మనవిచేసుకోడానికి సత్యం గుర్తించడానికీ చాలా అంతరం వుంది. ఢిల్లీలో వజీర్లు ఏవ వస్తువు తెచ్చినా దాని మంచిచెడ్డలు తెలియకుండా అది బాదుషావారి సన్నిధిలో వుంచనిస్తారా?"

తల తాటించుకుంటూ దివాంజీ యిలా అడిగేటప్పటికి, ఖాను, నిలువునా నీరయిపోయాడు.

పట్టిపెళ్ల అత్తరు సౌరభంతో అతని యెడల మిక్కిలి అనురక్తులయి వున్న పెద్ద మనుష్యులు యీమధ్య పేచీ విని నిర్విణ్ణు లయిపోయారు.

రాజబంధువులలో వొకాయన, యెగిసిపడి. అపహాసించి దివాంజీ యెడల నిరసనభావం కనబరచగా, జోసిపోటిశాస్త్రులు "శాంతి" అన్నట్టు నుదుట వేలుంచుకుని మొగం వంచుకున్నాడు.

రాణేదారు, ఇదంతా గుర్తించాడు.

వెంటనే ఖానుణ్ణి సంబోధించి "దివాంజీవారిప్పుడు చాలా తొందరపనిలో వున్నారు. ఇప్పటికి వెళ్లిపో. మరో పూటు దర్శనం చేసుకుందువు గాని" అన్నా డతను.

"ఇది బాగుంది" అన్నట్టందరూ తల లూపుతున్నారు.

అంతమంది పెద్దమనుష్యులకు తన యెడల సానుభూతి వుండినందుకు తృప్తిపడి, మళ్లీ సలాములు చెప్పి బుర్రవంచుకుని బయలుదేరాడు ఖాను.

గుమ్మం దాటాటప్పటికే రెండు పెట్టెలూ తెచ్చి జవాను అతని చేతిలో వుంచాడు.

## 3

ఆ రాత్రి తెల్లవార్లూ కంటికి నిద్రలేదు, ఖానుకి. నోటికి ముద్దా పోలేదు.

బుద్ధి కూడా మందగించి పోయింది.

కళ్లు మూసుకున్నా తెరుచుకున్నా దివాను చికిలింపు చూపులే కనపడ సాగాయి.

కిట్టింపు ధర చెప్పమనడం వొక్కటే వినపడసాగింది.

దీంతో, క్షణక్షణమూ యీ దెబ్బలు తింటున్నట్టే బాధపడిపోయా డతను.

అయితే, లోకప్రవృత్తి యేకముఖంగా వుండదు సత్యమే.

ముక్కుసూటిగా వెడదామంటే యెవరికీ సాధ్యమూ కాదు, నిజమే.

దీనికి సాయం, ప్రతిఘటనలు తటస్థిస్తేనే జీవితానికి పరిణతి.

ప్రతిఘటనలు అతిక్రమించగలిగితేనే జీవితానికి విజయమున్నూ.

కాని, ఒక్కొక్క జీవితానికి హృదయమే పునాది అయితే, మరొక్కొక్క జీవితానికి మేధస్సే ప్రధానం అయివుంటుంది.

ఎక్కడ మేధస్సు ప్రధానమో అక్కడ అనుభూతి తక్కువ.

అక్కడ సానుభూతిన్నీ పూజ్యమే.

ఏ జీవితానికి పునాది హృదయమో అక్కడే కళలకు స్థావరం.

అక్కడే కళలకు పరిణతి.

అక్కడే కళలకు వినియోగం.

# గులాబీ అత్తరు

అక్కడే, తన్మాత్రంగా ఆనందానుభవమున్నా.

అలాంటి ఆనందం తా ననుభవించా లన్నా ఇతర్లకు కలిగించా లన్నా, కళాశీలి మహాతపశ్శాలి అయి వుండాలి.

కళావేత్తృతలోనే—కళా సాధనలోనే తన జీవితం పరిపక్వం చేసుకుంటూ వుండాలి.

ఏమంటే?

ఎవరి సంకల్పం విశుద్ధమో, ఎవరి హృదయం కళామయమో, ఎవరి దీక్ష అలోకసామాన్యమో, ఎవరి ప్రాప్యం లోకకల్యాణమో ఆ కళాశీలుల నిర్మాణాలే ద్వంద్వభూయిష్ఠమైన భౌతికజగత్తులో ధ్రువతార లయి మెరుస్తూ వుంటాయి.

నిజంగా, ఖాను, అలాంటి కళాశీలి.

అతని అత్తరులు అలాంటి ధ్రువతారలు.

అయినా "అక్కర్లేదు" అని చెప్పేస్తే, వెంటనే అత నర్థమూ చేసుకోగలడు, సులభంగా నిరాశా చేసుకోగలడు, నిర్విచారంగా వెళ్లిపోనూ గలడు.

కాని యిదేమిటి, యీ వాలకం?

తన అత్తర్లకు విలవ కేవలమూ డబ్బే అయితే అందుకోసం అత నింత దూరం రానక్కరలేదు.

ఢిల్లీనగరమే వొక దేశం అంత.

అక్కడే ఎందరో ప్రభువులూ, సంపన్నులూను.

వారిలో, ఎందరో రసికులు.

అతని అత్తర్లు కళ్లకద్దుకునే వారు, వారిలో, మళ్లీ వందలూ వేలూను.

అయితే, పెద్దాపురం ప్రభువు, శ్రీశ్రీశ్రీ శ్రీవత్సవాయి చతుర్భుజ తిమ్మ జగపతిరాజు రసికత ఢిల్లీలో గుబాళించింది.

ఢిల్లీపాదుషాల రసికతకు వంకలు దిద్దింది.

ఖాను ఆగలేకపోయాడు.

దీక్షపట్టాడు.

తపస్సులో కూచున్నాడు.

అపూర్వసాధన చేశాడు.

తహతహ లాడిపోయాడు.

రెక్కలు కట్టుకువచ్చి వాలాడు.

కాని, షష్టిగడియలూ పువ్వులతోనే కాలం గడిపే అతని కిక్కడ ప్రభుదర్శనం గగనపుష్పం అయిపోయింది.

అపూర్వజాతిరత్నం గులకరాళ్లలో కూరుకు పోయిన ట్టనిపించిం దతనికి.

వచ్చివచ్చి ముళ్లకంచెల్లోనూ, మురికిగుంటలోనూ పడ్డట్టు బాధపడ్డా డతను.

"అంత ఢిల్లీలో కూడా—అంతంతలేసి వణి గ్లయినా చెయ్యలేని కుట్ర యిది" అని పరితపించా డతను.

బయట వుండగా పెద్దాపురం యెంత ఆశకొలి పిందో, ప్రవేశించాక అంత దిగగుంజేసిన ట్టనిపించిం దతనికి.

దక్షిణదేశానికి దక్షిణదేశమే దుష్టమృగసంకీర్ణ మైన మహారణ్యంలా తోచిం దతనికి.

దీంతో "ముక్కూ మొగమూ యెరగని చోటికి రావడం మనదే బుద్ధితక్కువ" అని పిసుక్కున్నా డతను.

కాని, తన భృత్యుల చేతిలో వొక కళాశీలి ఎంత క్షోభపడిపోతున్నాడో మహారాజు కెలా తెలుస్తుంది?

లోకంలో, ఎక్కడా కూడా, యిలాంటి అంత రువులు తప్పవంటే సమ్మతమే.

అయితే, ఎంతెంతలేసి ధర్మరాజ్యాలలోనూ, మహోదారులైన ఎలాంటి ప్రభువుల పరిపాలనలోనూ, అసంతృప్తి కలిగిందంటే—ఏవగింపు పొటమరించిందంటే — విరోధభావం పుట్టుకువచ్చిందంటే—కల్లోలాలు చెలరేగాయంటే అక్కడ కార్యనిర్వాహకుల ఇలాంటి అతిలౌక్యాలవల్లనే.

కాని, యేది యేమయినా ఖానుకిక్కడ వొకటే ఫలితం.

అంచేత "సమ్మానం మాట దేవుడెరుగును, మర్యాదగా అయినా యిక్కణ్ణుంచి వెళ్లగలమా ?" అని బెంగపట్టుకుందతనికి.

ఎటు చూసినా అంధకారమే కనపడిందతనికి.

ఇలా వుండగానే కోళ్లు కూశాయి.

పనిలో పని, కాకులు కూడా కూసేశాయి.

తెల్లవారడం తడువుగా వెళ్లి రాణేదారు పాదాల మీద వాలాడు, షుకురల్లీఖాను.

ఇంతవరకూ అంత గొప్ప అత్తర్లు పెద్దాపురం కోటకి రాలేదు, రాణేదారుకి తెలుసు.

ఖానుకి మంచి సమ్మానం జరగడం దివాంజీకి సుతరామూ ఇష్టం లేదు, ఇదీ తెలుసు అతనికి.

బుర్ర యెగిరిపోదాని కయినా వొప్పుకుంటాడు; గాని, ఖాను, కిట్టింపుధర చెప్పడు, ఇదిన్నీ తెలుసు అతనికి.

చూశాడంటే మహారాజు ఖానుఅత్తర్లు విడిచిపెట్టడు, ఇది, ఆసమయంలో, దివాంజీ సన్నిధిని వుండినవారందరూ గుర్తించేశారు.

రాణేదారు ఆలోచించాడు.

ఉండుండి, "సాహసించగలవా ?" అనడిగాడతను.

"మానం నిలిచేటట్టు లేదు, ఇక ప్రాణాలెందుకూ ? ఆజ్ఞాపించండి" అని ప్రాధేయపడ్డాడు ఖాను.

"ఇక నువ్వు కోటలో ప్రవేశించడం అసాధ్యం—ప్రవేశించినా, ముందుకి వెళ్లడం అసాధ్యం. వెళ్లినా నిలవగలగడం దుర్ఘటం. ఇన్నీ జరిగితే మాత్రం నీకోరిక సఫలం అవుతుంది తప్పదు."

"సెల విప్పించండి"

"మహారాజు, దినమ్మో నాలుగ్గడియల పొద్దువేళ పంచకల్యాణి మీద కొండల్లోకి షికారు వెంచేస్తారు"

"సెల విప్పించండి"

"కోట ప్రాకారం దాటకుండా నువ్వు వారి కళ్లబడాలి. కనీసం, నీవట్టివేళ్ల అత్తరు అయినా వారి నాకర్షించాలి ?

"సెలవిప్పించండి"

"దివాంజీవారు, ఇదివరకే యిది వూహించి వుంటారు. ఇందుకు ప్రతిక్రియా ఆలోచించి వుంటారు. ఆజ్ఞలు మాత్రం యింతవరకూ పుట్టలేదు"

"సెలవిప్పించండి"

"నీకు అదృష్టం వుంటేనే ఆయనకిది మరుపు వస్తుంది. మహారాజు కెట్టిపుట్టినా మరుపు వస్తుంది. లేదూ, నువ్వు వంకదార ప్రవేశించలేవు"

"సెల విప్పించండి"

"నావల్ల కాతగ్గదింతే. ఇక నీమేటికి అడ్డపడు"

ఖానుకి ఊపిరి తిరిగింది.

"నిన్న నేను దాఖలుచేసుకున్నది చందినీ అత్తరు ఇదిగో, ఇదిన్నీ స్వీకరించండి. దివాంజీవారికి నా మీద అనుగ్రహమూ లేకపోయింది, యిది వాడుకునే యోగమూ లేకపోయింది, యెవరేమి చెయ్యగలరూ?

తమరు చివరి ఉపాయం చెప్పాను. బతికి వుంటే మీ మేలు మరవను''

ఇలా అని, మూడు మార్లు వంగి సలాములు చెప్పి ఖాను వెళ్ళిపోయాడు.

౫

ఖాను కోటలో ప్రవేశించాడు.

వంకి దారి దాటి అనుమానిస్తూనే పదడుగులన్నా వేశాడు.

కాని ఇంతలో "అరె అరె" అని నాలుకలు కరచుకుంటూనూ, "ఎక్కడికి ఎక్కడికి?" అని ప్రశ్నిస్తూనూ వచ్చి నలుగురు సిపాయీలు లత్తీ అటకాయించారు.

ఖానుకి, ఒక్క క్షణం రక్తం ఉడుకెత్తింది.

చూపులు చెదిరిపోయాయి.

ఇంతలో నిలవరించుకుని "నేను దివాంజీవారి దర్శనానికి వెడుతున్నా"నన్నాడతను.

"ఇప్పుడు వీలులేదు" అన్నారు సిపాయీలు.

"నేను పాతవాళ్ళనేనయ్యా! నిన్న సాయంత్రం మాట్లాడే వున్నాను"

"అయితే, వారి లోగిటి దగ్గిరికి వెళ్ళి కనిపెట్టుకుని వుండు లోకేం?"

"ఠాణేదారుగారి కచేరీకి తీసుకువెళ్ళండి"

"వారిప్పుడు దివాంజీవారి సన్నిధిలో వున్నారు"

"కనిపెట్టుకు వుంటాను, పోనీ"

"ఆపని వారి యింటి దగ్గిర, కోటలో వల్ల కాదు"

"ముందుకి రానివ్వకండి" అని సిపాయీల కాజ్ఞ.

"ప్రాకారంలో నిలవగలిగితే చాలు" అని ఖానుకి సలహా.

ఉభయులకూ కావలసిన కాలహరణానికి కర్తవ్యాంతరం కలగలేదు.

ఖాను యుక్తులు కురిపించాడు.

సిపాయీలు వాటికి పైకి కదలు వచ్చారు.

వారి సంపరిని ఒరుసుకుంటూ పోతోంది కాలం. ఇంతలో, ఆచుట్టుపట్ల పనిచేస్తున్నవారందరూ వచ్చి మూగారు.

వచ్చే పోయేవాళ్ళున్నూ నిలిచిపోయారు.

చూస్తూ వుండగానే మహారాజా చదరంగం స్నేహితులూ, దశావతారీ సహచరులూ వచ్చి మూగారు.

"ఏమిటేమి?" అన్నారు కొందరు.

ఖాను తన అవస్థ అంతా చెప్పుకున్నాడు.

సిపాయీలున్నూ తమ అసహాయస్థితి చెప్పుకున్నారు.

ఇలాగ ఒక్క గడియ గడిచింది.

అంతవరకూ అక్కడ నిలపగలిగినందు కానందిస్తున్న సిపాయీలు, మరొకడు వచ్చి యేదో చెప్పగా "ఇక దయచెయ్యి" అనడం ప్రారంభించారు.

"రాజు బయలుదేరుతున్నాడు. అంచేతనే వీళ్ళు పొమ్మంటున్నారు. ఇక గెంటుతారు" అని గుర్తించాడు, ఖాను.

చిరవాంఛా, దీర్ఘశ్రమా యిలాగ వ్యర్థం అయిపోతున్నందుకు చాలా చాలా కుమిలిపోయాడతను.

చుట్టూ మూగి వుండినవారిలో పెద్దమనుష్యులుగా కనబడుతున్నవారి నుద్దేశించి "యీరాజ్యంలో కళాకారుల కిదా సన్మానం?" అని నిక్కచ్చిగా అడిగాడు.

అంతే.

అతని శరీరం అంతా వాలిపోయింది.

కళ్లెర్రబడ్డాయి.

చూపులు నిశితబాణాలు అయి పోయాయి.

ఆస్థితిలో ఉగ్రమైన గులాబీఅత్తరు పైకి తీశాడతను.

అందరూ చూపు లప్పగించేశారు.

“ఇది పెద్దాపురం ప్రభువుకోసం తయారు చేశాను” అంటూ ముందు, సీసా చేతియిచ్చుకుని పెట్టె కిందికి విడిచిపెట్టేశాడతను.

తరవాత మళ్లీ అందుకుని “ఢిల్లీ పాదుషావారు అటూ, పెద్దాపురం ప్రభువుగారు ఇటూ అన్న గౌరవభావంతో, నా శక్తినా శ్రద్ధ పూర్తిగా వినియోగించి బొట్టుబొట్టుగా కూడబెట్టానిది. ఒక్క రాకతో, నా పేరు దక్షిణదేశంలో నిలిచిపోతుం దన్న పేరాశతో నా రక్తం అనుకుంటూ కూడ బెట్టానిది. అయితే, పెద్దాపురం ప్రభువు ఎంత రస సులో వారి పరివారం అంత విరసులు అని నేను తెలుసుకోలేకపోయాను. ఇది నాకు కాదు అమర్యాద. ఇది నా గులాబీ అత్తరుకు కాదు అగౌరవం. ఇది పెద్దాపురం మహారాజుకి అందించడానికి నా కిక మార్గాలు లేవు; కాని ఇది వెనక్కి తీసుకు వెళ్లడం నాకే కాదు. మా కుటుంబానికే శిరచ్ఛేదం. ఇక నాకున్న తృప్తి ఒక్కటే. దివాంజీవారి అతి లౌక్యంతో కనుమూసే మహారాజులుంగారి స్వచ్ఛ కీర్తి, ఢిల్లీ నివాసి ఘనుకరక్లీఖాను గులాబీఅత్తరు సౌరభాలతో కలకాలమూ గుబాళిస్తూ వుంటుంది చాలు, నా కది” అంటూ పూర్ణ శ్వాసతో కోట గోడకి విసిరికొట్టాడతను సీసా.

సీసా భళ్లు మంది.

రాజసభుల హృదయాలు ఝల్లు మన్నాయి.

ఆ ప్రదేశం అంతా అత్తరుసౌరభంతో గుప్పు మంది.

అందరూ ఆపరిమళానికి మత్తెక్కుతున్న ట్టయి పోయారు.

తెలివి వచ్చి అందరూ కళ్లెత్తి చూశాటప్పటికి, శాంతంగానూ, అప్రయత్నంగానూ వెనక్కి తిరిగి ఖాను, కనుమాయమయిపోయాడు.

ఇదేమిటో అని అందరూ వెనక్కి చూడగా, పంచకల్యాణి మీద కూచుని శ్రీశ్రీశ్రీ శ్రీవత్స వాయితిమ్మజగపతి మహారాజులుంగారు అరగంట చూస్తూ అర సొక్కి వున్నారు.

మోర పైకెత్తుకుని వుండి, పంచకల్యాణి ఉండుండి సప్రయత్నంగా ఊపిరితీసుకుంటోంది.

* * *

ఇప్పటికీ, ఆప్రదేశంలో గులాబీ అత్తరు సౌరభం గుబాళిస్తూనే వుంటుం దంటారు, చూసివచ్చినవారు.

[౧౫ నిమిషాలకు సరిపోయేటట్లు కుదించి ౧౬–౫–౪౩ తేదీ సాయంత్రం ౭–౩౦ నిమిషాలకు మద్రాసు రేడియోలో చదివిన కథ యిది.]